kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

శుక్రవారం • 24-04-2026 | పేజీలు: 4

360° SINGLE TOPIC

దవాఖాన్ల దందా


# కార్పొరేట్ వైద్యం

## తెలంగాణలో ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ




### అడ్మిట్ అయితే చాలు.. జేబులు గుల్ల

### యావరేజ్‌గా రూ.73 వేలు కట్టాల్సిందే

### ప్రభుత్వాస్పత్రుల కంటే 12 రెట్లు ఎక్కువ

తెలంగాణలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు వైద్యం పేరుతో దోచుకుంటున్నాయి. ఒక్కసారి హాస్పిటల్‌లో అడ్మిట్ అయితే జేబులు గుల్ల కావాల్సిందే.. ఆస్తులు అమ్ముకోవాల్సిందే.. అప్పులు చేయాల్సిందే. దేశ సగటుతో పోలిస్తే తెలంగాణలో ప్రైవేట్, కార్పొరేట్ వైద్యం ఖరీదైన వ్యవహారం. శవానికి కూడా ట్రీట్‌మెంట్ చేసే ఘనత తెలంగాణలోని ఆస్పత్రులకే దక్కింది.

ఏ చిన్న కారణంతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరినా యావరేజ్‌గా దాదాపు రూ.73 వేలు ఖర్చవుతున్నది. అదే ట్రీట్‌మెంట్‌కు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు రూ.6 వేల బిల్లు అవుతున్నది. అంటే ప్రభుత్వాస్పత్రులతో పోలిస్తే దాదాపు 12 రెట్లు ఎక్కువ. ఇక దేశవ్యాప్తంగా హాస్పిటలైజేషన్ బిల్ సగటున రూ.37,858. దీనితో పోలిస్తే తెలంగాణలో సుమారు 55% ఎక్కువ.

ఆరోగ్య రంగంపై దేశవ్యాప్తంగా సర్వే చేపట్టిన కేంద్రం.. తెలంగాణలోని పరిస్థితులను కళ్లకు కట్టింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్‌కు సగటున ఎంత ఖర్చవుతున్నదో లెక్కగట్టింది. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు తర్వాత తెలంగాణలోనే ఎక్కువ దోపిడీ జరుగుతున్నదని సర్వే స్పష్టం చేసింది. దేశ ఆరోగ్య రంగానికి సంబంధించి నేషనల్ శాంపిల్ సర్వేలో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. వాటన్నింటిపై కలం 360 డిగ్రీస్ స్పెషల్ స్టోరీ..

- తెలంగాణ బ్యూరో, కలం

### తెలంగాణలో ఇలా..

| హాస్పిటల్ | రూరల్ | అర్బన్ |
|---|---|---|
| గవర్నమెంట్ | 8,124 | 2,384 |
| ప్రైవేట్ | 66,757 | 79,783 |

### దేశంలో ఇలా..

| హాస్పిటల్ | రూరల్ | అర్బన్ |
|---|---|---|
| గవర్నమెంట్ | 7,330 | 6,413 |
| ప్రైవేట్ | 49,734 | 66,955 |

(నోట్: ఒక్కసారి ప్రైవేట్/కార్పొరేట్ హాస్పిటల్‌లో చేరితే అవుతున్న సగటు ఖర్చు)




## మినిమం 50 వేలు కావాల్సిందే..

తెలంగాణలో ఏదైనా అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే సగటున రూ.52,743 ఖర్చవుతున్నది. అదే అర్బన్ ప్రాంతాల్లో అయితే రూ.79,783, రూరల్‌లో అయితే రూ.66,757 బిల్లు అవుతున్నది. దేశవ్యాప్త గణాంకాలను పరిశీలిస్తే సగటున రూ.34,064 మాత్రమే ఖర్చవుతున్నది. గతేడాది తెలంగాణలో అత్యధికంగా కనీస స్థాయిలో రూ.46,316 (రూరల్, అర్బన్ కలిపి సగటున) ఖర్చయింది. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఇది రూ.3,711 మాత్రమే. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చినా తెలంగాణలోని ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే ఎక్కువ ఖర్చయింది. ఆస్పత్రిలో చేరకుండా (అడ్మిట్ కాకుండా) ఓపీ (ఔట్ పేషెంట్) రూపంలో డాక్టర్‌ను కలిసినా మినిమం రూ.2 వేలు ఖర్చవుతున్నది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఓపీ కోసం జనం యావరేజ్‌గా రూ.1,991 ఖర్చు చేసినట్లు తేలింది. ప్రభుత్వాస్పత్రిలో మాత్రం కేవలం రూ.124 ఖర్చయింది.

## హైదరాబాద్ అడ్డాగా ఆస్పత్రుల దందా..

రాష్ట్రంలో సుమారు 5వేల ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ఉంటే.. అందులో దాదాపు 60% హైదరాబాద్ పరిధిలోనే ఉన్నాయి. వీటిల్లో దాదాపు 4 వేలకు పైగా ప్రైవేట్ ఆస్పత్రులుంటే వందకు పైగా కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ కట్టి దానికి అనుబంధంగా జనరల్ ఆస్పత్రిని అటాచ్ చేసినా, వైద్యారోగ్యానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచినా ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రుల బిజినెస్ మాత్రం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఉంటున్నది. జూనియర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ మొదలు స్పెషలిస్టుల వరకు ప్రభుత్వం డాక్టర్లను రిక్రూట్ చేస్తున్నా, 10 వేలకు పైగా నర్సింగ్ ఆఫీసర్ల నియామకాలు పూర్తి చేసినా ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రుల్లో అడ్మిషన్లు మాత్రం తగ్గలేదు. వాటి వ్యాపారమూ, అనైతిక పద్ధతులూ పెరుగుతున్నాయి.



## గ్రామాల్లో సర్కార్ దవాఖానలోనూ ఖర్చు ఎక్కువే..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కువ ఖర్చవుతుంటే.. పట్టణాల్లో మాత్రం ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎక్కువ ఖర్చవుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లోని జనరల్ ఆస్పత్రుల్లో అడ్మిట్ అయిన పేషెంట్లకు గతేడాది యావరేజ్‌గా రూ.8,124 ఖర్చయితే.. పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం రూ.2,384 ఖర్చయింది. ప్రైవేటు ఆస్పత్రుల విషయంలో మాత్రం గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లోనే ఎక్కువ వసూలవుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ఛారిటబుల్, ప్రైవేటు ఆస్పత్రుల్లో గతేడాది యావరేజ్‌గా ఒక్కో పేషెంట్ రూ.52,743 ఖర్చు చేయగా దేశవ్యాప్త సగటు రూ.37,858 మాత్రమే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రాష్ట్రాల్లో కలిపి యావరేజ్ ఖర్చు రూ.6,631గా ఉంటే తెలంగాణలో మాత్రం అంతకంటే తక్కువే (రూ.5,856). ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అడ్మిషన్ భారం మాత్రం చాలా ఎక్కువ. విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినా ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. దోపిడీ పెరుగుతూనే ఉన్నది. ప్రజలకు వైద్యం భారంగా మారుతున్నది.




ఏఐ ఫోటో

## ? వైద్యానికి ఏ రాష్ట్రంలో ఎంత ఖర్చు

(నోట్: ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకసారి అడ్మిట్ అయితే సగటున అవుతున్న ఖర్చు)

| రాష్ట్రం | ఖర్చు |
|---|---|
| తెలంగాణ | 52,743 |
| ఆంధ్రప్రదేశ్ | 42,517 |
| బిహార్ | 40,075 |
| పంజాబ్ | 40,075 |
| తమిళనాడు | 48,288 |
| ఢిల్లీ | 42,904 |
| కర్నాటక | 40,599 |
| మహారాష్ట్ర | 44,778 |
| కేరళ | 41,410 |
| గుజరాత్ | 38,607 |
| రాజస్థాన్ | 21,829 |





## ఏంటీ సర్వే?

ఇది 80వ నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్). దీన్ని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) నిర్వహించింది. ఈసారి దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంపై 2025 జనవరి నుంచి డిసెంబర్ మధ్య సర్వే నిర్వహించింది. దేశవ్యాప్తంగా 1,39,732 కుటుంబాల నుంచి వివరాలు సేకరించింది. రూరల్ ఏరియాలో 76,296, అర్బన్ ఏరియాలో 63,436 కుటుంబాల నుంచి వివరాలు తీసుకుంది.

- తెలంగాణలో మొత్తం 4,504 కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు. ఇందులో రూరల్‌లో 2,104, అర్బన్‌లో 2,400 ఫ్యామిలీలు ఉన్నాయి.
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,233 మందిని సర్వే చేశారు. వీరిలో రూరల్‌లో 8,378, అర్బన్‌లో 8,855 మంది ఉన్నారు.

## ఆస్పత్రుల్లో చేరుతున్నది వృద్ధులే ఎక్కువ..

వివిధ అనారోగ్య కారణాలతో వృద్ధులే ఎక్కువగా ఆస్పత్రుల్లో చేరుతున్నారు. 60 ఏండ్లు దాటిన వారిలో హాస్పిటలైజేషన్ రేట్ ఎక్కువగా ఉన్నది. హాస్పిటలైజేషన్ రేట్ 0–4 ఇయర్స్ పిల్లలో 3.45, 5–14 ఏండ్ల పిల్లల్లో 1.1, 15–29 ఏండ్ల వాళ్లలో 1.5, 30–44 ఏండ్ల వాళ్లలో 2.3, 45–59 ఏండ్ల వాళ్లలో 4.2, 60 ఏండ్లు పైబడిన వాళ్లలో 8.1 శాతంగా ఉంది.

- 0–4 ఇయర్స్ పిల్లలు ఎక్కువగా ఇన్ఫెక్షన్స్‌తో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. దాదాపు 43.8 శాతం వివిధ ఇన్ఫెక్షన్లతో గతేడాది హాస్పిటళ్లలో అడ్మిట్ అయ్యారు.
- 5–14 ఏండ్ల పిల్లలు కూడా ఎక్కువగా ఇన్ఫెక్షన్స్ బారినపడుతున్నారు. గతేడాది 47.8 శాతం మంది ఇన్ఫెక్షన్స్‌తో ఆస్పత్రుల్లో చేరారు.
- 60 ఏండ్లు పైబడిన వృద్ధుల్లో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. గతేడాది 18.2 శాతం మంది గుండె వ్యాధులతో ఆస్పత్రుల్లో అడ్మిట్ అయ్యారు.

# ప్రైవేట్ ఆస్పత్రులకే జనం పరుగు..

ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా జనం ఎక్కువగా ప్రైవేట్ ఆస్పత్రులకే పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం, ట్రీట్‌మెంట్ సరిగా అందించరనే భావనతో ఖర్చు ఎక్కువైనా ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లడానికే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని చెబుతున్న ప్రభుత్వాల ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి.


- గతేడాది రూరల్ ఏరియాల్లో 57.9 శాతం మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే చేరారు. 39.2 శాతం మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో, మరో 2.9 శాతం మంది చారిటబుల్ హాస్పిటళ్లలో ట్రీట్‌మెంట్ తీసుకున్నారు.
- ఇక అర్బన్ ఏరియాల్లో అయితే 64.6 శాతం మంది ప్రైవేట్‌కు, 32.2 శాతం మంది గవర్నమెంట్‌కు, 3.2 శాతం మంది చారిటబుల్ హాస్పిటళ్లలో అడ్మిట్ అయ్యారు.

## ప్రతి వెయ్యిలో 29 మంది హాస్పిటలైజ్..

గతేడాది ప్రతి వెయ్యి మందిలో 29 మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరారు. ఇది అర్బన్‌లో 32, రూరల్‌లో 27గా ఉంది. అంటే గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నారు.

- గత సర్వేలను పరిశీలిస్తే.. 2014లో అత్యధిక హాస్పిటలైజేషన్ రేట్ నమోదైంది. ఆ ఏడాది చేసిన 71వ ఎన్ఎస్ఎస్ సర్వే ప్రకారం ప్రతి వెయ్యి మందిలో 44 మంది ఆస్పత్రుల్లో అడ్మిట్ అయ్యారు.
- గతేడాది ప్రతి వెయ్యి మంది మగవాళ్లలో 30 మంది, ప్రతి వెయ్యి మంది ఆడవాళ్లలో 28 మంది ఆస్పత్రుల్లో చేరారు.
- పురుషులు ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతుండగా, మహిళలు ఎక్కువగా గ్యాస్ట్రో, యూరినరీ ప్రాబ్లమ్స్‌తో బాధపడుతున్నారు.







## ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగ్గిన డెలివరీలు..

మహిళలు డెలివరీల కోసం ఇప్పటికీ ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రులకే వెళ్తున్నారు. కానీ 2017–18తో పోలిస్తే ఇప్పుడది తగ్గింది. 2017–18లో రూరల్‌లో 69.2 శాతం మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే, ఇప్పుడది 66.8 శాతానికి పడిపోయింది. ఇక అర్బన్‌లో 2017–18లో 48.3 శాతం మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే, ఇప్పుడది 47 శాతానికి తగ్గింది.

- గతేడాది రూరల్‌లో 66.8 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరగ్గా.. 28.8 శాతం ప్రైవేట్‌లో, మరో 4.4 శాతం ఇంట్లో జరిగాయి. ఇక అర్బన్‌లో 47 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరగ్గా.. 50.8 శాతం ప్రైవేట్‌లో, మరో 2.2 శాతం ఇంట్లో జరిగాయి. దేశవ్యాప్తంగా రూరల్, అర్బన్ కలిపి చూసుకుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 61.7 శాతం డెలివరీలు జరుగుతుండగా.. ప్రైవేట్ హాస్పిటళ్లలో 34.5, ఇంట్లో 3.8 శాతం జరుగుతున్నాయి.

# దేశంలో కార్పొరేట్ దోపిడీకి ఈ డాక్టర్ రాజీనామే సాక్ష్యం!

‘‘అవసరం లేకపోయినా.. ప్రతి పేషెంట్‌ను హాస్పిటల్ లో అడ్మిట్ చేసుకోవాల్సిందే. ఐసీయూలో చేరిన పేషెంట్ ను ఎక్కువ రోజులు అందులో ఉంచాల్సిందే! లేకపోతే నీ కొలువు ఉండదు” ఇదీ డాక్టర్లపై చాలా కార్పొరేట్ హాస్పిటళ్లు పెడుతున్న ఒత్తిడి. పేషెంట్లను ఏటీఎంలుగా ట్రీట్ చేస్తున్నాయి. దీన్ని నిరసిస్తూ ఇటీవల ఓ యువ డాక్టర్  తన పోస్టుకు రాజీనామా చేస్తూ ఓ వీడియా రిలీజ్ చేశారు. ఆ డాక్టర్ మాటలే కార్పొరేట్ హాస్పిటల్స్ ధనదాహానికి నిలువుటద్దం. డాక్టర్ ప్రభ్లీన్ కౌర్.. ఫిజీషియన్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్. చండీగఢ్‌లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్ లో డాక్టర్ గా జాయిన్ అయిన రోజే రాజీనామా చేశారు. ఇందుకు కారణాలను సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో రూపంలో పంచుకున్నారు. పేషెంట్లను కార్పొరేట్ హాస్పిటళ్లు డబ్బుల యంత్రాల్లా చూస్తున్నాయని, వారి నుంచి దోచుకోవడానికి తమను వాడుకుంటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ‘‘అది పేరున్న కార్పొరేట్ హాస్పిటల్. పేషెంట్లకు నావంతుగా మంచి వైద్యం అందిద్దామని డాక్టర్ గా చేరాను. కానీ, మొదటిరోజే నేను రాజీనామా చేయాల్సి వస్తున్నది. ‘నీ దగ్గరికి ఓపీ (ఔట్ పేషెంట్) కోసం ఎంత మంది వస్తే అంతమందిని ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ చేసుకోవాల్సిందే’నని యాజమాన్యం కండిషన్ పెట్టింది. అవసరం లేని వాళ్లను ఎందుకు అడ్మిట్ చేసుకోవాలని ప్రశ్నిస్తే.. ‘నీ పని అంతే. అడ్మిట్ చేసుకోవాల్సిందే. పైగా ఐసీయూలో కూడా ఎక్కువ మంది అడ్మిట్ అయ్యేలా చూసుకోవాలి’ అని తేల్చిచెప్పింది. ఆ తీరు చూస్తుంటే.. పేషెంట్ల నుంచి ఎంత పడితే అంత డబ్బులు దోచుకోవాలన్నదే హాస్పిటల్ యాజమాన్యం పనిలా నాకు తోచింది. పేషెంట్లను ఏటీఎంలా చూడటం ఏమిటి? నా మెడ మీద తుపాకీ పెట్టి.. ఎదుటివాళ్లను కాల్చాలనుకుంటే డాక్టర్ గా నేను భరించలేను. రోగుల ప్రాణాలు కాపాడాల్సిన మేం.. వారి రక్తం పీల్చుకునే కార్పొరేట్ హాస్పిటళ్ల ధనదాహానికి పావులు కాదల్చుకోలేదు. అందుకే రాజీనామా చేస్తున్నా” అని వీడియోలో ఈ యువ డాక్టర్  తెలిపింది. ఆమె నిర్ణయానికి సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్ హాస్పిటళ్ల తీరుపై నెటిజన్లు భగ్గుమంటున్నారు.



డాక్టర్ ప్రభ్లీన్ కౌర్



## పెరిగిన హెల్త్ స్కీమ్స్, ఇన్సూరెన్స్‌లు..

ప్రజల్లో హెల్త్‌పై అవగాహన పెరిగింది. ఏదైనా ఎమర్జెన్సీ అయితే హెల్త్ ఇన్సూరెన్స్ యూజ్ అవుతుందని భావిస్తున్నారు. ఒకప్పుడు చాలా తక్కువ మంది మాత్రమే హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోగా, ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. కొంతమంది ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ వినియోగిస్తుండగా, మరికొంత మంది ప్రభుత్వాలు తీసుకొచ్చిన వివిధ స్కీమ్‌లను వినియోగించుకుంటున్నారు.

### ఆసుపత్రుల్లో చేరుతున్న వారిలో ఇన్సూరెన్స్ ఉన్నది ఎందరికీ?

- 2017–18లో రూరల్‌లో హెల్త్ ఇన్సూరెన్స్‌ల శాతం 14.1 ఉండగా, ఇప్పుడది 47.4కి పెరిగింది.
- 2017–18లో అర్బన్‌లో హెల్త్ ఇన్సూరెన్స్‌ల శాతం 19.1 ఉండగా, ఇప్పుడది 44.3కి పెరిగింది.